క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివి

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేయనుండటంతో శుక్రవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు ఈ క్రింద తెలిపిన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.వి.సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శాంతినగర్, దేవినేని గాంధీపురం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని పేర్కొన్నారు.

రేపు తాగునీటి సరఫరాకు అంతరాయం

పటమట(విజయవాడతూర్పు): భవానీపురం హెడ్‌వాటర్ వర్క్సులోని 5ఎంజీడీ(పాతది) క్లియర్ వాటర్ కంపార్టుమెంట్-2లో సంపును శుభ్రపరుస్తున్నందున ఈ నెల 14వ తేదీ నగరంలోని పలు ప్రాంతాల్లో నీటిసరఫరాకు అంతరాయం కలుగుతుందని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సర్కిల్-1 పరిధిలోని శ్రీనివాసమహల్, ఫిష్ మార్కెట్, గాంధీ బావి-1, గాంధీబావి-2, అంబేడ్కర్ కాలనీ, ఓఆర్‌ఆర్‌ఎస్, గాంధీ హైస్కూల్ రిజర్వాయర్ల తోపాటు నేరుగా నీటి సరఫరా చేసే రథం సెంటర్, పూలబావి, శివాలయం, కొట్టేటి కోటయ్య, నైజాగేటు ప్రాంతాల్లో నీటిసరఫరాను ఈ నెల 14వ తేదీ ఉదయం 8 నుంచి రాత్రి 11 గంటల వరకు నీటి సరఫరాను నిలిపివేస్తున్నామని వివరించారు.

రేపు ఎక్స్‌రే సాహిత్య అవార్డుల ప్రదానం

విజయవాడ కల్చరల్: ఎక్స్‌రే సాహిత్య సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీ శనివారం ఎక్స్‌రే సాహిత్య అవార్డుల ప్రదాన సభ నిర్వహిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి బోడి ఆంజనేయరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు రోడ్డులోని మెడికల్ అసోసియేషన్ హాల్లో ఆ రోజు సాయంత్రం 6 గంటలకు సభ జరుగుతుందని తెలిపారు. ఎక్స్‌రే సాహిత్య పత్రిక నిర్వహించిన జాతీయ కవితా పోటీల విజేతలకు బహుమతీ ప్రదానం జరుగుతుందని తిరుపతికి చెందిన నల్లు రమేష్‌కు అత్యుత్తమ కవితా పురస్కారం, 10 మంది కవులకు ఉత్తమ కవితా అవార్డులు అందజేయనున్నట్లు వివరించారు.

పేదల ఆకలి తీర్చడంలోనే సంతృప్తి



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): పేదల ఆకలి తీర్చడంలోనే సంతృప్తి ఉంటుందని క్లే లలిత ట్రస్ట్ డైరెక్టర్లు క్లే సీతామహాలక్ష్మి, జయదుర్గ అన్నారు. ఆ ట్రస్ట్ ఆధ్వర్యంలో సింగ్‌నగర్ రైతుబజార్ వద్ద గురువారం అన్నసమారాధన జరిగింది. వారు మాట్లాడుతూ పేదలకు సహకరించాలనే సంకల్పంతో తమ తల్లి క్లే లలిత పేరుతో ట్రస్ట్‌ను ఏర్పాటుచేశామని తెలిపారు. నాటి నుంచి ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు, నిరుపేదలకు ఆర్థిక సాయం, చిరువ్యాపారులకు తోపుడుబండ్లు, పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలను, పనిముట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు క్లే నాగేశ్వరరావు, సభ్యులు ముప్పూరి హరీష్, ఎం.జశ్విన్, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

చురుగ్గా రోడ్డు విస్తరణ పనులు



పాయకాపురం(విజయవాడరూరల్): విలేజి కండ్రిక నుంచి కండ్రిక కాలనీ వరకు సుమారు మూడు కిలోమీటర్లు నిర్మించే రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయి. పది రోజుల క్రితం మైనింగ్ గ్రాంట్ రూ.3.40 కోట్లతో రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. 4.5 మీటర్లున్న రోడ్డును ఏడు మీటర్ల వరకు విస్తరణ చేయనున్నారు. బీటీ రోడ్డు పనులు చురుగ్గా జరుగుతుండగా ఇంజినీరింగ్ అసిస్టెంటు నవీన్, పార్టీ నేత యర్రగొర్ల శ్రీరాములు స్థానికులు గురువారం ఆ పనులను పర్యవేక్షించారు. నేషనల్ హైవే ఫ్లై ఓవర్ కింది భాగంలో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి.

దసరా రాటా ఏర్పాటు



పాయకాపురం(విజయవాడరూరల్): రాజీవ్ గృహకల్ప కాలనీ హెచ్ బ్లాక్ వద్ద దేవీ నవరాత్రులు నిర్వహించడానికి గురువారం పందిరి రాటా ఏర్పాటుచేసి పూజ చేశారు. వైఎస్సార్ సీపీ 61వ డివిజన్ 262 సచివాలయం జగనన్న గృహసారథులు, స్వామి వివేకానంద సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో దేవీ నవరాత్రులు నిర్వహిస్తున్నట్లు 262 గృహసారథి ఆర్‌ఎస్ నాయుడు తెలిపారు. ఈ నెల 15వ తేదీ నుంచి 24 వరకు నవరాత్రులు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో పద్మావతి, మోర తిరుపతిరెడ్డి, సుబ్బులు, వెంకటదుర్గారావు, అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యం

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



26వ డివిజన్‌లో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అన్ని వర్గాల సంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 26వ డివిజన్ 30వ వార్డు సచివాలయ పరిధిలో గురువారం ఐదో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, డివిజన్ ఇన్‌చార్జి అంగిరేకుల నాగేశ్వరరావుతో కలిసి గడప గడపకు వెళ్లి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే విష్ణు ప్రభుత్వ పథకాలను వివరించారు. ఆయన మాట్లాడుతూ అర్హత ఉండి పొరపాటున ఎక్కడైనా మిగిలిపోయిన వారికి కూడా ఏడాదికి రెండు సార్లు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ప్రభుత్వ పథకాలు అందజేస్తున్నామన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

గృహ నిర్మాణంలో మైలురాయి

పేదలందరికీ సామూహిక గృహ ప్రవేశాలు రాష్ట్ర చరిత్రలో ఓ మైలురాయి అని మల్లాది విష్ణు అన్నారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో 30.75 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు 71,811.49 ఎకరాల్లో ఇళ్ల పట్టాలను ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. వీటిల్లో 7.43 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తవ్వగా.. సెంట్రల్ నియోజకవర్గంలో 2,024 ఇళ్లను పూర్తి చేసుకున్నట్లు వెల్లడించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఒక్క సెంట్రల్ నియోజకవర్గంలోనే రూ. 179.62 కోట్లు వెచ్చించి 428.62 ఎకరాల్లో పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే విష్ణు పేర్కొన్నారు.

అమిత్ షాపై దాడిని మర్చిపోయారా..?

చంద్రబాబు హయాంలో రాష్ట్రంలో ఆటవిక రాజ్యం, అరాచక పాలన సాగిందని మల్లాది విష్ణు విమర్శించారు. మే 11, 2018న తిరుపతిలో అమిత్ షా పై జరిగిన దాడే దీనికి నిదర్శనమన్నారు. కుటుంబ సమేతంగా శ్రీవారి దర్శనానికి వచ్చిన అమిత్ షా కాన్వాయ్‌ను వెంబడించి మరీ ఆనాడు టీడీపీ శ్రేణులు కర్రలు, రాళ్లతో దాడికి తెగబడ్డారని గుర్తుచేశారు. ఈ అరాచకమంతా జరిగింది చంద్రబాబు, నారా లోకేష్ డైరెక్షన్లో కాదా..? అని సూటిగా ప్రశ్నించారు. దాడికి చంద్రబాబే బాధ్యత వహించాలని నాడు బీజేపీ ప్రతినిధులు మాట్లాడలేదా..? మళ్లీ ఏ ముఖం పెట్టుకుని అమిత్ షాను నారా లోకేష్ కలిశారని మల్లాది విష్ణు ప్రశ్నించారు. పోలవరంను ఏటీఎంలా వాడుకున్నారని సాక్షాత్తూ ప్రధానే అనేక సందర్భాల్లో విమర్శించినట్లు ఎమ్మెల్యే గుర్తుచేశారు. దీనిపై పురందేశ్వరి ఏ సమాధానం చెబుతారన్నారు..? ఆమె ఏపీ బీజేపీ చీఫ్‌గా కాకుండా, టీడీపీ అధ్యక్షురాలిగా వ్యవహరిస్తున్నారని సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పిన మాటే నిజమైందని మల్లాది విష్ణు అన్నారు. వీఎంసీ అధికారులు, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణలో పారిశుద్ధ్యమే కీలకం

- ఎమ్మెల్యే మల్లాది విష్ణు
- రూ. 15.35 లక్షల వ్యయ అంచనాతో శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రజారోగ్య పరిరక్షణలో పారిశుద్ధ్యం అత్యంత కీలకమని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 26వ డివిజన్ మాచవరం డౌన్ నార్ల వారి వీధిలో రూ. 15.35 లక్షల వ్యయ అంచనాతో శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయ భవన నిర్మాణ పనులకు డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి గురువారం ఆయన భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే పరిసరాల పరిశుభ్రత ఎంతో ముఖ్యమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, వీఎంసీ సంయుక్తంగా చేపడుతున్న కార్యక్రమాలతో డివిజన్లు సంపూర్ణ ఆరోగ్యకర ప్రాంతాలుగా విరాజిల్లుతున్నాయన్నారు. నియోజకవర్గంలోని 21 డివిజన్ల పరిధిలో ప్రస్తుతం 1,300 మంది పారిశుద్ధ్య కార్మికులు, 21 మంది శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఇద్దరు ఏఎంఓహెచ్‌లు విధులు నిర్వహిస్తున్నట్లు మల్లాది విష్ణు వెల్లడించారు. స్థానిక కార్యాలయాల ఏర్పాటుతో సేవలను మరింత విస్తృతం చేయవచ్చని తెలిపారు. ప్రస్తుతం వినియోగంలో ఉన్న కార్యాలయాలకు మరమ్మతులు చేస్తున్నట్లు మల్లాది విష్ణు చెప్పారు. కార్యక్రమంలో ఏఈ వెంకటేష్, కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరి, నాయకులు అంగిరేకుల నాగేశ్వరరావు, వీఎంసీ సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సిబ్బంది అందుబాటులో ఉండాలి

దసరా ఉత్సవాలపై సమీక్ష



దసరా ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): దసరా ఉత్సవాల్లో పారిశుద్ధ్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని, అప్రమత్తంగా ఉండాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో గురువారం వివిధ విభాగాల అధికారులతో సమీక్షించారు. ఉత్సవాలకు పారిశుద్ధ్య కార్మికులు 3 షిఫ్ట్‌ల్లో 24 గంటలూ అందుబాటులో ఉండాలని, మరుగుదొడ్లు, ఆలయాల పరిసర ప్రాంతాలు, రోడ్లు, క్యూ లైన్లు నిరంతరం పరిశుభ్రంగా ఉండాలన్నారు. సిబ్బందికి సకాలంలో భోజన ప్యాకెట్లను అందించాలని, తాగునీటి పాయింట్లను ఏర్పాటు చేసి నిరంతరం భక్తులకు తాగు నీరు అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. నగరంలోని సీతమ్మవారి పాదాలు, శనీశ్వర స్వామి ఆలయం, భవానీపురం పున్నమి ఘాట్ పలు స్నాన ఘాట్లు, కెనాల్ రోడ్డు తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా సిబ్బంది సమన్వయంతో వ్యవహరించాలన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి. సత్యవతి, అదనపు కమిషనర్(జనరల్) శకుంతల, చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకర్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, సిటి ప్లానర్ జి.వి.జి.ఎస్.వి ప్రసాద్, ఇన్‌చార్జి జోనల్ కమిషనర్ - 1 డాక్టర్ రవిచంద్, ఎస్.ఈ డి.నరసింహ మూర్తి, ఎస్టేట్ ఆఫీసర్ టి .శ్రీనివాస్, ఏడీహెచ్ శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

వృత్తి విద్యా కోర్సులతో మెరుగైన ఉపాధి అవకాశాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): వృత్తి విద్యా కోర్సులతో మెరుగైన ఉపాధి అవకాశాలు పొందవచ్చని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు చెప్పారు. రావిచెట్టు సెంటర్‌లోని జనశిక్షణ సంస్థాన్ ఆవరణలో గురువారం నైపుణ్య స్నాతకోత్సవం-2023 పేరుతో వివిధ వృత్తి విద్యా కోర్సుల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ కొన్ని పనులు చేయడానికి ఎటువంటి నైపుణ్యాలు అవసరం లేదని, మరికొన్ని పనులు చేయడానికి తప్పకుండా అవసరమన్నారు. వృత్తి విద్యా కోర్సులు నేర్చుకున్న వారిలో నైపుణ్యాల పెంపునకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శిక్షణను అందిస్తున్నాయని, యువత వాటిని వినియోగించుకోవాలని సూచించారు. నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ (ఎన్‌ఎస్‌డీ) స్టేట్ డైరెక్టర్ పి.శాంతన మాట్లాడుతూ ఎన్‌ఎస్‌డీ తరఫున నిర్వహిస్తున్న శిక్షణ కేంద్రాలను యువత వినియోగించుకోవాలని కోరారు. కేంద్రప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపక మంత్రిత్వ శాఖ (ఎంఎస్‌డీఈ) జనరల్ ట్రైనింగ్ విభాగం డైరెక్టర్ పి.చంద్రమౌళి మాట్లాడుతూ నైపుణ్యం పెంపునకు ప్రభుత్వం శిక్షణ ఇవ్వడమే కాకుండా ఆ తర్వాత యూనిట్లను నెలగొల్పడానికి సబ్సిడీతో కూడిన రుణాలను మంజూరు చేస్తున్నాయని వివరించారు. జనశిక్షణ సంస్థాన్ చైర్‌పర్సన్ ఎస్.విద్యాకన్నా మాట్లాడుతూ 40 ఏళ్లుగా ఎంతో మంది యువతకు తమ కేంద్రంలో వివిధ స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ ఇచ్చి పారిశ్రామిక వేత్తలుగా ఎదగడానికి కృషి చేశామన్నారు. జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ, వివిధ కోర్సుల్లో శిక్షణ పూర్తి చేసిన వారు పాల్గొన్నారు.

మహిళలు అడ్డంకులను అధిగమించాలి



మాట్లాడుతున్న రామ్మోహనరావు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ఆడపిల్ల జన్మిస్తే ఆహా అనుకునే రోజులు రావాలని, మహిళలు అడ్డంకులను అధిగమించి అభివృద్ధి వైపు పయనించాలని ముఖ్య అతిథులు ఏపీ ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ రామ్మోహనరావు, స్టేట్ ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ చాగంటి ఉషా రాజ్యలక్ష్మి తెలిపారు. కేవీఎస్‌ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాల, సేఫ్ (స్టెప్ ఏ హెడ్ ఫర్ ఈక్వాలిటీ) సంస్థ ఆధ్వర్యాన సిద్ధార్థ ఆడిటోరియంలో గురువారం అంతర్ కళాశాల సాంస్కృతికోత్సవాల పేరుతో కళాశాల విద్యార్థులకు రెండు రోజుల పాటు జరిగే పోటీలు మొదలయ్యాయి. రామ్మోహనరావు జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్త్రీ, పురుషుల మధ్య సమానత్వ సాధనకు కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మరో అతిథి స్టేట్ ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ చాగంటి ఉషా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ మహిళలు ప్రతి అవకాశాన్ని వినియోగించుకుంటూ అభివృద్ధి చెందాలన్నారు. సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు నాగేశ్వరరావు, సేఫ్ సంస్థ అధ్యక్షురాలు జి.జోత్స్న, సిద్ధార్థ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత, సేఫ్ సంస్థ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక పోటీలు

సాంస్కృతిక పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. స్కిట్, మైమ్, మిస్టర్ అండ్ మిస్ సేఫ్, సెల్ఫ్ డిఫెన్స్ పోటీల్లో వివిధ కళాశాలల విద్యార్థినులు సత్తా చాటారు.

24న పుణ్యతిథి మహోత్సవం

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో ఈ నెల 24వ తేదీ మంగళవారం షిర్డీసాయి 105వ మహాసమాధి పుణ్యతిథి మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు మందిర వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి వీరమోహనరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 7 గంటలకు బాబాకు 21 దివ్య ద్రవ్యాలతో అభిషేకం, అన్నాభిషేకం జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం 1008 వెండి పుష్పాలతో సహస్ర నామార్చన చేస్తామని తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం అన్న ప్రసాదవితరణ జరుగుతుందని పేర్కొన్నారు. దీపాలంకరణ సేవ చేస్తారని తెలిపారు.

సమన్వయంతో పని చేయాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆరోగ్య సిబ్బంది, వార్డు సచివాలయం సిబ్బంది, వలంటీర్లు సమన్వయంతో పనిచేసి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని 30వ డివిజన్ కార్పొరేటర్ బీహెచ్‌ఎస్‌వీ జానారెడ్డి సూచించారు. 30 డివిజన్ వార్డు సచివాలయం సిబ్బంది,ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లతో గురువారం సమీక్ష సమావేశం జరిగింది. ఆయన డివిజన్‌లో జగనన్న సురక్ష పథకం అమలు తీరు అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి వైద్యపరీక్షలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు దుర్గారావు, విశాలాక్షి, ధనంజయ పాల్గొన్నారు.

కనక దుర్గమ్మకు స్వరనీరాజనం

విజయవాడ కల్చరల్: దసరా మహోత్సవాల సందర్భంగా గాయనీ గాయకులు, కళా సంస్థల ఐక్యవేదిక ఆధ్వర్యాన గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న స్వరనీరాజనం కార్యక్రమాలు గురువారం రెండో రోజుకు చేరుకున్నాయి. గురువారం ఫ్రెండ్స్ ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో భక్తి గీతాలు, హిందీ చిత్ర గీతాలు, క్లాసికల్ గీతాలను ఆలపించారు. సీనియర్ గాయకుడు సయ్యద్ ఆలీ ఆధ్వర్యంలో మల్లాది స్వాతి, డేవిడ్‌రాజు, ప్రసాద్, పావని, భానుశ్రీ, రసూల్‌బాబు గీతాలను ఆలపించారు. వివిధ కళా సంస్థల ప్రతినిధులు పరచూరి విజయలక్ష్మి, చింతకాయల చిట్టిబాబు, బండారు నరసింహారావు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

పాయకాపురం(విజయవాడరూరల్): నున్న పోలీసుస్టేషన్ పరిధి ప్రజాశక్తినగర్‌కు చెందిన మట్టపెల్లి జోషి(19) అనుమానాస్పదస్థితిలో మృతి చెందినట్టు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆటోడ్రైవర్‌గా పని చేస్తున్న మృతుడు ఎం. జోషి అతని తండ్రి దాసు ఇద్దరు ఒకే ఆటోను నడుపుతుంటారు. గురువారం జోషి.. తండ్రిని ఆటో తాళం ఇవ్వాలని అడిగిన విషయంలో ఇద్దరి మధ్య వివాదం ఏర్పడింది. తండ్రి తాళం ఇవ్వకుండా బయటకు వెళ్లాడు. తర్వాత వచ్చి చూడగా జోషి ఇంట్లో సీలింగ్‌రాడ్‌కు లుంగీతో ఉరివేసుకొని మరణించాడు. మృతుని అక్క పాలపర్తి నిర్మల ఫిర్యాదుతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

డ్రంకన్ డ్రైవ్‌లో 11 మందికి జరిమానా

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): నగరంలో రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్ టీకే రాణా ఆదేశాల మేరకు నగరంలో మద్యం సేవించిన వాహనచోదకులపై పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. గురువారం 4వ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో 11 మంది వాహన చోదకులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. వారిని ఎనిమిదవ అడిషనల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి విజయ్‌కుమార్ 11 మందికి ఒక్కొక్కరికి రూ. 10వేలు జరిమానా విధించారు.

'చేరువ'తో సైబర్ క్రైంపై అవగాహన

పాయకాపురం(విజయవాడరూరల్): సైబర్ నేరాలపై అవగాహన కల్పించడానికి పోలీసు యంత్రాంగం శ్రీకారం చుట్టింది. నేరాలకు అడ్డుకట్ట వేయాలనే ప్రధాన ఉద్దేశంతో నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు గురువారం ఎన్టీఆర్ జిల్లా పోలీస్ అధికారులు, చేరువ నేర నియంత్రణ అవగాహన వాహనంతో వివిధ కళాశాలల యువతకు, ప్రజలకు సైబర్ క్రైం సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న నేరాలపై అవగాహన కల్పించారు. పాయకాపురం, వడ్డెరకాలనీల్లోని ప్రజలకు పోలీస్ అధికారులు, సిబ్బంది చేరువ వాహనం ద్వారా పిల్లలకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ అంటే ఏంటి అనే విషయాలపై నేరాల బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను చిన్న చిన్న వీడియోల రూపంలో ఎల్ఈడీ స్క్రీన్ పై ప్రదర్శించారు. కార్యక్రమంలో దిశ పోలీస్ స్టేషన్ పోలీస్ అధికారులు, సిబ్బంది స్థానికులు పాల్గొన్నారు.

నగరంలో 23న ప్రభ మహోత్సవం

- 'సిద్ధార్థ'లో 15 నుంచి దసరా ఉత్సవాలు
- ఉత్సవ కమిటీ చైర్మన్ గంగరాజు



మాట్లాడుతున్న గోకరాజు గంగరాజు, కృష్ణ ప్రసన్న తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలో తొలిసారిగా శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా దసరా ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆ కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్సవాలు నిర్వహించే సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో గురువారం ఉత్సవ కమిటీ విలేకరుల సమావేశం నిర్వహించింది. సమావేశంలో చైర్మన్ గోకరాజు గంగరాజుతో పాటు, జనరల్ సెక్రటరీ వైట్ల కృష్ణ ప్రసన్న వివరాలు వెల్లడించారు. ఈ నెల 15 నుంచి 24 వరకూ ప్రతిష్టాత్మకంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాల్లో రోజూ ఉదయం కుంకుమార్చన, చండీహోమం జరుగుతుందన్నారు. నిత్యం ఉదయం 11 నుంచి 12.30 గంటల వరకూ కల్యాణం, సాయంత్రం 5.30 నుంచి 6.30 వరకూ సామూహిక లలిత సహస్ర పారాయణం ఉంటాయని తెలిపారు. రాత్రి 7.30 నుంచి 9 గంటల వరకూ రోజూ వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 23న అత్యంత వైభవోపేతంగా ప్రభమహోత్సవం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్, సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, ప్రత్యేక సలహాదారు కిలారు సత్యనారాయణ, కొల్లి హారిక, వెలగపూడి రామకృష్ణ, గ్రంధి శ్రీరామసుబ్రహ్మణ్యంతో పాటు పలువురు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రయోగాత్మకంగా తెలియజేయడానికే విజ్ఞాన యాత్ర



మొక్కలను పరిశీలిస్తున్న విద్యార్థులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు తెలుసుకున్న పాఠ్యాంశాలను ప్రయోగాత్మకంగా తెలియజేయడానికి విజ్ఞానయాత్రలు దోహదపడతాయని ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి తెలిపారు. నగరంలోని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యాన బీఎస్సీ ద్వితీయ, తృతీయ సంవత్సరం బోటనీ, హార్టికల్చర్ విద్యార్థులు పాఠ్య ప్రణాళికలో భాగంగా గురువారం మూలపాడు రిజర్వ్ ఫారెస్టును సందర్శించారు. దీన్ని ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి ప్రారంభించారు. యాత్రలో విద్యార్థులు వివిధ రకాల వృక్షజాతులను, జీవ వైవిధ్యాన్ని అధ్యయనం చేశారు. మూలపాటు బటర్‌ఫ్లై పార్క్‌ను సందర్శించడంతో వివిధ రకాల సీతాకోక చిలకలను వాటి జీవిత చక్రంలోని వివిధ దశలను విద్యార్థులు తెలుసుకున్నారు. వృక్ష శాస్త్ర విభాగాధిపతి జి.స్వప్న, అధ్యాపకులు వి.నాగపద్మావతి, సీహెచ్ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో అటవీశాఖ సహకారంతో విద్యార్థులు విజ్ఞాన విహార యాత్రను పూర్తిచేసుకున్నారు. విద్యార్థులు మూలపాడు రిజర్వ్ ఫారెస్టులోని వృక్షాలను ఆసక్తిగా పరిశీలించి విజ్ఞానం పెంపొందించుకున్నారు.

విద్యార్థులూ.. 'ఉపాధి' కోర్సులను వినియోగించుకోండి

ప్రొఫెసర్ నజీర్ అహ్మద్



తుమ్మలపల్లి కళాక్షేత్రం ఫ్యాషన్ షో



నలంద విద్యార్థుల నృత్య ప్రదర్శనలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): నూతన విద్యా విధానానికి అనుగుణంగా విద్యా సంస్థల్లో ఉపాధి అవకాశాలు కల్పించే నూతన కోర్సులను ప్రారంభించామని, వాటిని వినియోగించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ఉన్నత విద్యా మండలి సెక్రటరీ ప్రొఫెసర్ నజీర్ అహ్మద్ పేర్కొన్నారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గురువారం నిర్వహించిన నలంద డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయన మాట్లాడుతూ మార్పులకనుగుణంగా ఉపాధి ఆధారిత కోర్సులను డిగ్రీ కళాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో ప్రవేశపెట్టినట్లు చెప్పారు. ప్రధానంగా కమ్యూనికేషన్ స్కిల్స్‌కు ప్రాధాన్యమిచ్చినట్లు తెలిపారు. నలంద డిగ్రీ కళాశాల చక్కని కోర్సులను అందించడంతోపాటు విద్యార్థులకు అన్ని అంశాల్లో శిక్షణ ఇచ్చి వారి నైపుణ్యాన్ని పెంపొందిస్తున్న యాజమాన్యం కృషి అభినందనీయమన్నారు. నలంద విద్యా సంస్థల చైర్మన్ విజయబాబు మాట్లాడుతూ తమ డిగ్రీ కాలేజీలో యూనివర్సిటీ సిలబస్‌తోపాటుగా అదనపు కోర్సులను అందిస్తున్నామని తెలిపారు. ఏటా నిర్వహించే క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఎక్కువ మంది విద్యార్థులు ఉపాధి పొందుతున్నారని చెప్పారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా నలంద డిగ్రీ కాలేజి విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. డిగ్రీ ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు సెకండ్, థర్డ్ ఇయర్ విద్యార్థులు స్వాగతం చెబుతూ సినీ, పాశ్చాత్య డ్యాన్స్‌లతో సందడి చేశారు. నలంద విద్యార్థులు ప్రదర్శించిన ఫ్యాషన్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

బీడీసీలను సక్రమంగా నిర్వహించాలి

గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్‌పర్సన్ జమలపూర్ణమ్మ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లాలో పుస్తక పంపిణీ కేంద్రాలను (బీడీసీ) సక్రమంగా నిర్వహించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ టి.జమలపూర్ణమ్మ నిర్వాహకులకు సూచించారు. ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో గురువారం శాఖా గ్రంథాలయాల గ్రంథపాలకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కేంద్రాల నిర్వహణపై పలు సూచనలు చేశారు. కొన్ని కేంద్రాలు సక్రమంగా నిర్వహించడం లేదని తన దృష్టికి వచ్చిందని వాటిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రంథాలయాల అధికారులు ప్రతినెలా బీడీసీలను పరిశీలించాలన్నారు. రోజూ ఉదయం 8 నుంచి 11 గంటల వరకు పుస్తక పంపిణీ కేంద్రాలు తెరిచి ఉంచాలని, ఆయా కేంద్రాల్లో సిబ్బంది సక్రమంగా విధులు నిర్వర్తించాలన్నారు. సమావేశంలో జిల్లాలోని గ్రంథాలయాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'దసరా' ట్రాఫిక్ మళ్లింపునకు సహకరించాలి

ఏడీసీపీ(ట్రాఫిక్) ప్రసాద్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): దసరా ఉత్సవాల నేపథ్యంలో చేపడుతున్న ట్రాఫిక్ మళ్లింపునకు నగర ప్రజలు సహకరించాలని విజయవాడ పోలీస్ కమిషనరేట్ ఏడీసీపీ (ట్రాఫిక్) ప్రసాద్ కోరారు. వన్‌టౌన్‌లోని వెస్ట్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దసరా ఉత్సవాలకు వచ్చే భక్తుల కోసం కొన్ని చర్యలు చేపట్టామన్నారు. అందులో భాగంగా క్యూలైన్‌ను దర్గా నుంచి రోడ్డుకు అవతల వైపు ఉన్న మోడల్ గెస్ట్‌హౌస్ వైపునకు మార్చామన్నారు. ఆ క్రమంలో రథం సెంటర్ నుంచి దుర్గాఘాట్ వరకూ నో వెహికల్ జోన్‌గా ప్రకటించామని తెలిపారు. కేవలం అత్యవసర వాహనాలు, ఆలయంలో జరిగే ఉత్సవానికి వివిధ వస్తువులు తీసుకెళ్లే చిన్న వాహనాలను మాత్రమే అనుమతిస్తామని చెప్పారు. ఏ వాహనమైనా పోలీసు కంట్రోల్ రూమ్ వద్ద ఉన్న ఫ్లై ఓవర్ మీదగా భవానీపురానికి చేరుకొని భవానీఘాట్ వద్ద దేవస్థానం ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశంలో తమ వాహనాలను ఉంచి కొండపైకి రావాల్సి ఉంటుందన్నారు. భక్తులకు వినాయకుని ఆలయం వద్ద నుంచి ఏర్పాటు చేసిన క్యూలైన్లలో ఆలయ దర్శనానికి అనుమతిస్తారని వివరించారు. కుమ్మరిపాలెం సెంటర్ నుంచి వన్‌టౌన్‌కు వెళ్లే స్థానికులు, పాతబస్తీ నుంచి భవానీపురం వెళ్లే ప్రజలు ఉత్సవాల సమయంలో సొరంగ మార్గాన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో వెస్ట్‌జోన్ లా అండ్ ఆర్డర్ ఏసీపీ హనుమంతరావు, ట్రాఫిక్ ఏసీపీ-1 ఆర్.రామచంద్రరావు, భవానీపురం సీఐ సలామ్, స్థానిక ట్రాఫిక్ సీఐ ఎం.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.